క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న కవురు శ్రీనివాస్

వీరవాసరం : ఆధ్యాత్మిక భావన ద్వారా శాంతి సమాజం ఏర్పడుతుందని జిల్లా పరిషత్ జడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. తోలేరులోని శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోనూ, నవుడూరు జంక్షన్‌లోని శ్రీ పద్దాల అంకమ్మ వారి ఆలయంలోనూ బుధవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు, అమ్మవార్లకు ప్రత్యేక హోమాలు, అభిషేకాలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనాన్ని గడపాలని ప్రార్థించారు. ఆయా కార్యక్రమాల్లో చావ్వాకుల సత్యనారాయణమూర్తి, పెన్మత్స సూర్యనారాయణ రాజు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, కలిదిండి సూరిబాబు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆశీస్సులతో..


ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు వేద ఆశీర్వచనాలు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని ఈ నూతన సంవత్సరంలో మరింత అభివృద్ధి దిశగా నడిపించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఉగాది సందర్భంగా బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో శ్రీ మావుళ్ళమ్మ దేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగన్న బాబు, ధర్మకర్తల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ చిన్న, ఈమని శ్రీరామచంద్ర సోమయాజి ఘనాపాటి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా శ్రీ దాసాంజనేయ స్వామి పల్లకీ సేవను ఎమ్మెల్యే శ్రీనివాస్ దర్శించారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ


అమ్మవారికి బంగారం సమర్పిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన యశ్వంత్ వెంకట వెంకట దుర్గా మణికంఠ, జస్వంత్ సూర్య వినాయక కుటుంబ సభ్యులు 8 గ్రాముల బంగారాన్ని సమర్పించారు. వీరికి ఆలయ సిబ్బంది రసీదు, అమ్మవారి ప్రసాదం అందజేశారు.

ఘనంగా తెప్పోత్సవం


బొండాడలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: బొండాడలో స్వామివారి తెప్పోత్సవం మంగళవారం రాత్రి కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామంలో వేంచేసియున్న భోగేశ్వరస్వామి, జనార్దన స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివార్లను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా స్వామి వారి తెప్పోత్సవం వైభవపేతంగా నిర్వహించారు. తెప్పోత్సవం తిలకించేందుకు గ్రామంలోని పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఆకివీడులో పాలకోడేరు అంగన్‌వాడీల విలీనం

ఆకివీడు: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) కార్యాలయంలో పాలకోడేరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్ని విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ పరిధిలో కేంద్రాలు ఉండాలనే ఉద్దేశంతో కేంద్రాలు విలీనం చేయాలని నిర్ణయించింది. ఇప్పటివరకు పాలకోడేరు మండలంలోని 66 అంగన్‌వాడీ కేంద్రాలు భీమవరం సీడీపీఓ పరిధిలో ఉండేవి. వీటిని ఆకివీడు ప్రాజెక్టులో విలీనం చేయడంతో ఆకివీడు ప్రాజెక్టులో ఇప్పటివరకు ఉన్న 195 కేంద్రాలతో కలిపి మొత్తం 261 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆకివీడు ప్రాజెక్టు పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు 11,468 మంది, గర్భిణులు 1104 మంది, బాలింతలు 1226 మంది ఉన్నారు. పాలకోడేరు మండల పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు 3,550, గర్భిణులు 350, 360 బాలింతలకు ఇకపై ఆకివీడు ప్రాజెక్టు నుండి మహిళా, శిశు సంక్షేమ పథకాలు అందనున్నాయి. పాలకోడేరు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు విలీనం చేయడంతో ఇకపై మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలు ఉండి నియోజకవర్గ పరిధిలో జరుగనున్నాయి.

ఘనంగా ఉగాది వేడుకలు


ఉగాది పురస్కారాలు అందుకున్న వారితో ఏఎస్పీ సుబ్బరాజు, ఆర్డీవో దాసిరాజు


శ్రీమావుళ్లమ్మ ఆలయంలో పంచాంగం శ్రవణం చేస్తున్న దృశ్యం


పూజలందుకున్న శ్రీపద్దాలంకమ్మవారు

భీమవరం(ప్రకాశం చౌక్): ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ (చిన్ని), దేవస్థాన వేద పండితులు రామచంద్ర సోమయాజులు ఘనాపాఠి పంచాంగ శ్రవణం చేశారు. శోభకృత్ నామ ఉగాది సంవత్సరం ఏవిధంగా ఉంటుందనేదానిపై, ప్రజలకు జరిగే మంచిచెడ్డలు, రాశిఫలాలను వివరించారు. అనంతరం పలువురికి పంచాంగ పుస్తకాలను పంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ యరర్రంశెట్టి భద్రాజీ, ధర్మకర్తలు పాల్గొన్నారు.

పంచారామక్షేత్రంలో..

పంచారామక్షేత్రం గునుపూడిలోని శ్రీఉమాసోమేశ్వర జనార్దనస్వామి వారి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని ప్రత్యేక ప్రవచనాలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నైమిషారణ్య పీఠాధిపతులు పూజ్యశ్రీ బాల బ్రహ్మనంద సరస్వతి శ్రీశివతత్త్వ రహస్యం గురించి ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.అరుణ్‌కుమార్, ధర్మకర్తలు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా పలు ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, శ్రీవిజ్ఞానవేదిక, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని భీమేశ్వరస్వామి దేవస్థానంలో శోభకృత్ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కలశంతో మావుళ్ళమ్మ దేవస్థానం వరకు ఉగాది లక్ష్మీ ఆశీర్వచనాలు, శుభాకాంక్షలతో శోభాయాత్ర జరిపారు. ఆనంతరం జరిగిన ఉగాది వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఆర్డీవో దాసి రాజు, అడిషనల్ ఎస్పీ అల్లూరి సుబ్బరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆనాటి ప్రాచీన కళలు జంగం దేవర, పిట్టల దొర, కొమ్మ దాసరి తదితర ప్రదర్శనలు నేటి తరానికి తెలియజేయడం చాలా సంతోషకరమన్నారు. 34 ఏళ్లుగా ఈ వేడుకలను సంప్రదాయంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన 72 మందికి ఉగాది పురస్కారాలు అందించారు. ప్రముఖ డోలు విద్వాంసులు వడ్లది కృష్ణను సుమారు రూ.రెండు లక్షల విలువ కలిగిన సువర్ణ హస్తా ఘంటా కంకణంతో సత్కరించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ చీడే సత్యనారాయణ, పట్టణ ప్రముఖులు వభిలిశెట్టి కనకరాజులను సత్కరించినట్లు నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తెలిపారు. ఉగాది వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు, గంగిరెద్దుల విన్యాసాలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, మెంటే పార్థసారధి, కనుమూరి సత్యనారాయణ రాజు, భూపతిరాజు సత్యనారాయణ రాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, కార్యదర్శి నరహరిశెట్టి కృష్ణ, కంతేటి వెంకట్రాజు, వడుపు గోపి, చెరుకువాడ వెంకట్రామయ్య, షేక్ రబ్బానీ, యేలేటి న్యూటన్, మలిశెట్టి సాయిబాబు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పంచాంగ శ్రవణం

ఆకివీడు: శుభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలోనూ, భీమేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆయా రాశుల్లో జన్మించిన వారి గ్రహస్థితులు, రాశిఫలాలను వివరించారు. పంచాంగ శ్రవణం వినిపించిన కృష్ణ పరమాత్మను పెద్దింటి అమ్మ ఆలయ చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి, కుంకట్ల దానయ్య, మోరా జ్యోతి, గుర్రం హరి, సన్నిధి వెంకన్న, సమయమంతుల రామకృష్ణ తదితరులు సత్కరించారు.

అమ్మవార్లకు గ్రామోత్సవం

కాళ్ల : పల్లిపాలెం గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవతలు శ్రీ మారెమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల జాతర సందర్భంగా బుధవారం అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ ఘటాలకు మహిళలు పసుపు, కుంకుమలతో స్వాగతం పలికారు. ఏప్రిల్ 5, 6 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించే అమ్మవార్ల జాతర మహోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బర్రె కనకరాజు, మాజీ సర్పంచ్ తిరుమాని మార్రాజు, తిరుమల శెట్టి బాలాజీ, బస్వాని వడ్డికాసులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పద్దాలంకమ్మ జాతర

వీరవాసరం : నవుడూరు జంక్షన్‌లో వేంచేసిన శ్రీ పద్దాలంకమ్మ వారి జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాత పెన్మెత్స సూర్యనారాయణ రాజు, కలిదిండి సూరిబాబు, బండి బాలాజీ, కదిలి గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

మహదేవపట్నంలో అమ్మవార్ల జాతర ప్రారంభం

ఉండి: మహదేవపట్నంలో వేంచేసియున్న గంగానమ్మ, మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వెంకటగణేష్ తాపీ పనివార సంఘం ఆధ్వర్యంలో జాతరను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉప సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు, వైస్ ఎంపీపీ గుత్తుల కనకమహాలక్ష్మీ తదితరులు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గరగ నృత్యాలు, తీన్‌మార్, బుట్టబొమ్మలతో అమ్మవార్లు, స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఏటా అమ్మవార్ల జాతర వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పెన్మత్స రమేష్‌రాజు, గొట్టుముక్కల నాగరాజు, వేగేశ్న శివరామరాజు, వేగేశ్న వెంకటరామరాజు, వేగేశ్న శింగరాజు, తాపీపనివారల సంఘ నాయకులు గంటా అప్పారావు, గంటా కృష్ణ, గుడాల శ్రీను, బొక్కా బాలకృష్ణ, కలవల చిన్నబ్బులు పాల్గొన్నారు.


పంచారామక్షేత్రంలో బ్రాలబ్రహ్మనంద సరస్వతి ప్రవచనం


ఆకివీడు పెద్దింటమ్మ ఆలయంలో దోనేపూడిని సత్కరిస్తున్న దృశ్యం


పల్లిపాలెంలో అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


మహదేవపట్నం జాతరలో వైఎస్సార్‌సీపీ నేతలు, తాపీపనివారలు

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

వీరవాసరం : కొణితివాడలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ మూడో రోజు బుధవారం ఉత్సాహంగా సాగింది. కొణితివాడ, తణుకు, నరసాపురం, ఉండి, తాడేపల్లిగూడెం, ఆచంట జట్ల మధ్య పోటీలు ఆసక్తిగా సాగాయి. ముందుగా సీనియర్ కబడ్డీ క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజు భాస్కర్ రాజు, యరకరాజు చిన బాబు, గొలగాని సత్యనారాయణ రాజు, నాగరాజు వెంకట గోపాల కృష్ణంరాజు, కనకరాజు హరిబాబు, దుర్గాప్రసాద్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు

పేకాట శిబిరంపై దాడి

భీమవరం అర్బన్ : భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎస్సై మోహన్‌రావు తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నరసింహపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1800 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మోహన్‌రావు చెప్పారు.

కోడిపందేలపై దాడి

ఆకివీడు: మండలంలోని కోళ్లపర్రు గ్రామ శివారులో కొందరు కోడిపందేలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి బుధవారం చెప్పారు. వారి నుంచి రూ.2,200 నగదు, ఒక కోడి, ఒక కత్తి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


వెలివర్రులో పేరంటాలమ్మ జాతరను ప్రారంభించి మాట్లాడుతున్న పీవీఎల్


పెదఅమిరంలో పీవీఎల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- వెలివర్రులో పేరంటాలమ్మ జాతర ప్రారంభం

ఉండి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని ఆలయాలు, ఆధ్యాత్మిక అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బుధవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వెలివర్రులో వేంచేసియున్న వీరపేరంటాలమ్మ అమ్మవారి 70వ వార్షిక మహోత్సవాలను పీవీఎల్ ప్రారంభించారు. ఆలయ చైర్మన్ మంతెన రంగరాజు, గ్రామ సర్పంచ్ పెన్మత్స అంజనీదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముదునూరి కొండరాజు, కల్లేపల్లి సతీష్‌రాజు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ మర్యాదలతో పీవీఎల్ తదితరులను సత్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్ర దేవదాయ శాఖ ద్వారా ఆలయాలకు కావాల్సిన అన్ని మౌలిక వసతుల కల్పన జరుగుతోందన్నారు. దేవాలయాల పునఃర్నిర్మాణాలకు కావలసిన నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అమ్మవారి చల్లని దీవెనలతో ముఖ్యమంత్రి క్షేమంగా ఉండాలని, ఆయన మళ్లీ మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని అమ్మవారిని కోరుకున్నట్లు పీవీఎల్ తెలిపారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యులు రణస్తుల కనకదుర్గ, సర్పంచ్‌లు పెన్మత్స అంజనీదేవి, ముదునూరి వెంకటసోమరాజు, కొండవేటి సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు త్రిమూర్తులు, ఈది ఎడ్వర్డ్‌జాన్సన్, ఆలయ కమిటీ సభ్యులు ముదునూరి వీర్రాజు, గొట్టుముక్కల జానకీ రామరాజు, బొక్కా భవానీ, తలపాల చెంచులక్ష్మీ, కళ్ళేపల్లి రామచంద్రరాజు, బిరుదుకోట బాలవెంకటలక్ష్మీ, కాళ్లకూరి సురేష్‌కుమార్, కరిమెరక చంద్రరావు, బడుగు బాలాజీ, ఆలయ మేనేజర్ రుద్రరాజు ఫణిరామకిశోర్ పాల్గొన్నారు.

పీవీఎల్‌కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

కాళ్ల: కొత్త సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలు రైతులు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆకాంక్షించారు. పెదఅమిరం పార్టీ కార్యాలయంలో నియోజవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బుధవారం పీవీఎల్‌ను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఉగాది పండుగను తెలుగు ప్రజలు ఎంతో బాగా జరుపుకుంటారని, సంవత్సరం అంతా అందరికీ మంచి జరగాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న వేణుగానం


వేణుగానం చేస్తున్న ప్రవీణ కుమారి

భీమవరం(ప్రకాశం చౌక్): ఉగాది పురస్కరించుకుని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో డాక్టర్ వేగేశ్న ప్రవీణకుమారి వేణుగానం భక్తులకు ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు

నిప్పలగుండం తొక్కిన భక్తులు


విస్సాకోడేరులో నిప్పల గుండం తొక్కుతున్న దృశ్యం

పాలకోడేరు: శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని మండలంలోని ప్రజలంతా సంతోషంగా సంబరాలు చేసుకున్నారు. ఉదయాన్నే షడ్రుచులతో కలిసిన ఉగాది పచ్చడిని సేవించారు. ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. శృంగవృక్షం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పండితులు మునుకుట్ల నాగు పంచాంగ శ్రవణం నిర్వహించారు. విస్సాకోడేరులో నిప్పుల గుండం తొక్కారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అత్యం సూర్యప్రకాశరావు, గ్రంధి రాజా, కూర్మాల నారాయణరావు, నాగరాజు, గ్రంధి ప్రకాష్, పబ్బతి లక్ష్మి, కూర్మాల నరసింహారావు, రత్నకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల్లో సంతోషం


పీవీఎల్‌ను సత్కరిస్తున్న ఆకివీడు నాయకులు

ఆకివీడు: శుభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్రం మరింత శోభాయమానంగా ఉంటుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆకాంక్షించారు. ఉగాది సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పీవీఎల్ మాట్లాడుతూ గత మూడున్నరేళ్లుగా రాష్ట్రం వసంతోత్సవంతో నిండి ఉందన్నారు. మరో మూడు పర్యాయాలు కూడా ఇదే విధంగా రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందని, అందుకు ప్రజల మద్దతు పూర్తిగా ఉందని పీవీఎల్ చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పండుగనూ ప్రజలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారంటే, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన ఎంతో బాగుందని స్పష్టమవుతోందన్నారు. ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని పీవీఎల్ చెప్పారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయాలి

సాక్షి, భీమవరం : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 28 29 తేదీలలో ఢిల్లీలో మాలమహానాడు నిర్వహిస్తున్న హలో మాల చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని చినఅమిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్రోచర్స్ విడుదల చేసి ఆయన మాట్లాడారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద లక్షలాది మంది నిరసనతో వర్గీకరణ భూతాన్ని తిప్పికొట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ భూతాన్ని ముందు పెట్టి మాల, మాదిగల మధ్య చిచ్చుపెడుతోందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేతల సువర్ణరాజు, కోలాటి ప్రసాదరావు, నన్నేటి నాగరాజు, మానుకొండ కిరణ్, దాసరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కుల దూషణపై కేసు నమోదు

వీరవాసరం : కులం పేరుతో సర్పంచ్‌ను దూషించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. రాయకుదురు సర్పంచ్ గడ్డం భారతి కనకదుర్గ అమ్మవారి గుడికి వెళుతుండగా అదే గ్రామానికి చెందిన పినపరెడ్డి పెద్దిరాజు, పినపరెడ్డి నాగాంజనేయులు అడ్డగించి దౌర్జన్యానికి పాల్పడ్డారని, కులం పేరుతో దూషణలకు దిగారని, సర్పంచ్ గడ్డం భారతి భర్త భాస్కరరావు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని భీమవరం రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ చెప్పారు.

పురాతన శివలింగానికి అన్నాభిషేకం


బ్రహ్మసూత్ర శివలింగానికి అన్నాభిషేకం చేసిన భక్తులు

ఆకివీడు: అతి పురాతనమైన బ్రహ్మసూత్రం కలిగిన శివలింగానికి ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం అన్నాభిషేకం చేశారు. సిద్ధాపురంలోని మంచినీటి చెరువులో లభించిన పురాతన శివలింగాన్ని చెరువుగట్టుపై ఉంచి గ్రామస్తులు పూజలు చేస్తున్నారు. ఉగాది సందర్భంగా అభిషేకాలు చేశారు. అనంతరం అన్నాభిషేకం చేశారు. పురాతనమైన శివలింగానికి త్వరలో కంచి పీఠాధిపతుల సూచనల మేరకు ఆలయం నిర్మిస్తామని గ్రామ పెద్ద బీ.తిమ్మరాజు చెప్పారు. కార్యక్రమంలో పాలినాటి వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ తంగి పుష్కరరావు, భూపతిరాజు పృథ్వీ, నున్న గణపతి, పూసపాటి రాధకృష్ణంరాజు, గొట్టుముక్కల దుర్గరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


వేంద్రలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాలకోడేరు: వేంద్ర ప్రాథమిక పాఠశాలలో 1983–84 ఐదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఉగాది రోజు పాఠశాలలో కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలోని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకోవడం తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించుకోవడం జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేమని ఆనందం వ్యక్తం చేశారు. 40 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకోవడంతో కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని స్నేహితులతో సరదాగా గడిపారు. హుషారుగా ఆడి పాడారు. సహపంక్తి భోజనాలు చేసి, స్వీయ చిత్రాలు తీసుకున్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామగ్రి బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏడీ కృష్ణ, డీవీ సుబ్బరాజు, పీహెచ్ విశ్వనాథరాజు, కె.విజయ్‌కుమార్, ఎం.రమేష్ రాజు, జె.శ్రీనివాసరావు, డీహెచ్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణం ఆపాలంటూ నిరసన


చర్చి నిర్మాణం ఆపాలంటూ ధర్నా చేస్తున్న స్థానికులు

ఉండి: చెరుకువాడలో అక్రమంగా కడుతున్న చర్చ్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలంటూ స్థానికులు బుధవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా హిందూ మతాన్ని కాపాడాలి, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ నిరసన దీక్షకు పూనుకున్నారు. గతంలో చర్చి నిర్మాణం జరగనివ్వాలంటూ నిర్వాహకులు ఉండి సెంటర్‌లో ధర్నా చేయడం తెలిసిందే. అనంతరం చర్చి నిర్మాణాన్ని ఆపాలంటూ మరో పక్షం ఇటీవల స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. నిరసన కార్యక్రమంలో బొల్లా శ్రీనివాస్, గేదెల రాంబాబు, బొల్లా వెంకటపెద్దిరాజు, బొల్లా వెంకట్రావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.